

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT



తెలంగాణ ,ఆంధ్ర

విలేకరులు కావలెను

WANTED REPORTER'S

విలేకరిగా నాకు అవకాశం ఏవరైన ఇస్తే బాగుండు అనుకునేవారికి.ఆ అవకాశం మా డైలీరిపోర్ట్ తెలుగు దినపత్రిక మరియు టీవీ చానల్ మీకు ఇస్తుంది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న అన్ని

జిల్లలాకు, బ్యూరో లు, నియోజకవర్గాలు,మండలాల వారీగా కావలెను.

CONTACT US

www.dailyreporttelugu.com
+91 8501919707



సంపుటి: 1 సంచిక: 137 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ మంగళవారం 17-12-2024 వెల: 5/రూ -


# సర్పంచుల బిల్లులపై దుమారం

- పెండింగ్‌లో రూ.691 కోట్లు.. అవి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం నాటివే
- అందుకే అది 'బకాయిల రాష్ట్ర సమితి'.. మంత్రిగా సంతకం చేయని హరీశ్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదు.. కానీ ఆ బిల్లులు చెల్లిస్తాం: మంత్రి సీతక్క
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్.. కాంగ్రెస్ హస్తం భస్మాసుర హస్తమైంది: హరీశ్
- అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం.. 'లగచర్ల'పై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం
- తోసిపుచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. అసెంబ్లీ సమావేశాల్లో గరంగరం
- సభ అజెండాను ఇప్పుడే నిర్ణయించండి.. బీఏసీలో బీఆర్ఎస్ డిమాండ్
- సభ్యులు సలహాలిస్తారు.. స్పీకర్ అజెండా నిర్ణయిస్తారు.. రేవంత్ స్పష్టీకరణ



హైదరాబాద్, : శాసనసభ శీతాకాల సమావేశాలు గరంగరంగా జరుగుతున్నాయి. సోమవారం అసెంబ్లీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాయిదాలు, వాకౌట్ల పర్వం నడిచింది. శాసనసభలో 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యం' అని ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేయగా.. 'ఇది ప్రజాప్రభుత్వం' అని అధికారపక్ష సభ్యులు ప్రతి నినాదాలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఉదయం సభ వాయిదా పడి తిరిగి మధ్యాహ్నం ప్రారంభం కాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు


మిగతా 13వ పేజీలో...




## గ్రూప్-2 ప్రశ్నలపై వివాదం

- పరీక్షల్లో మావోయిస్టులు, ఎన్‌కౌంటర్లపై పది ప్రశ్నలు
- చంద్రబాబు విజన్ 2020 డాక్యుమెంట్ తయారీ సంస్థ ఏదీ?
- రాయపాటి, లగడపాటి, టి.సుబ్బరామిరెడ్డి కంపెనీలు ఏవీ?
- సమైక్య పాలకుల గురించి అడిగారంటూ విమర్శలు
- ప్రశ్నలు ఏపీపీఎస్సీ కోసమా?: మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్: చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పాలనా వ్యవస్థపై విజన్-2020 డాక్యుమెంట్‌ను తయారు చేసిన అంతర్జాతీయ సంస్థ ఏది..? రాయపాటి సాంబశివరావు, లగడపాటి రాజగోపాల్, టి.సుబ్బరామిరెడ్డి, కావూరి సాంబశివరావుల కంపెనీలు ఏమిటో గుర్తించండి..? ఇవి గ్రూప్-2 పరీక్షలో అడిగిన రెండు ప్రశ్నలు.. ఇలా సమైక్య పాలకులను గుర్తు చేసే పలు ప్రశ్నలను అడగడం వివాదాన్ని రేపింది. ముఖ్యంగా సంబంధం లేని ప్రశ్నలను అడిగారంటూ విమర్శలు వస్తున్నాయి. చంద్రబాబు, ఎన్టీఆర్ పాలన వంటి అంశాలపై అడిగిన ప్రశ్నలు చర్చకు దారితీశాయి. రాష్ట్రంలో ఆదివారం మొదలైన గ్రూపు-2 పరీక్షలు.. సోమవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయి. రెండు


2లో




## నేడే జమిలి బిల్లు

- కీలక బిల్లు నేపథ్యంలో
- బీజేపీ ఎంపీలకు విప్
- పార్లమెంటులో ప్రవేశపెట్టి.. వెంటనే జేపీసీకి..
- 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు
- 2034నాటికి జమిలి పరిధిలోకి స్థానిక సంస్థలు
- 2027లో పునర్విభజన, మహిళా రిజర్వేషన్ పూర్తి
- ఏదైనా రాష్ట్రంలో జమిలి సాధ్యం కాకపోతే..?
- రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆ అసెంబ్లీకి తర్వాత ఎన్నికలు
- ఈ మేరకు నిర్వహణకు వీలుండేలా బిల్లులో నిబంధన


2లో


## ఏడాదిలో మావోయిస్టులను ఏరివేస్తాం

- వారి వల్లే గ్రామాలు అభివృద్ధి చెందలేదు.. ఇప్పటికైనా లొంగిపోవాలి
- గ్రామాల్లో ఏడాదిలోపు వసతులు కల్పిస్తాం.. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు
- మావోయిస్టు నేత హిడ్మా ఇలాకాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- ఛత్తీస్‌గఢ్‌లోని గుండం గ్రామంలో బస ప్రారంభం.. గ్రామస్థులతో మాటామంతీ
- షా రాకతో భద్రతా బలగాలతో నిండిపోయిన దండకారణ్యం

# కాలంతో పరుగు!



- పోలవరం 2026 అక్టోబరుకే పూర్తవ్వాలి: సీఎం
- ప్రాజెక్టులో ప్రతి పనికీ కాల వ్యవధి.. నిర్దిష్ట కార్యాచరణ ప్రకటన
- జాప్యానికి తావులేకుండా పక్కా ప్రణాళిక
- అనుమతులు, ఇతరత్రా అంశాలపై దృష్టి
- ఇంజనీరింగ్ విభాగానికి అతిపెద్ద బాధ్యత
- 2న డయాఫ్రం వాల్ పనులకు శ్రీకారం
- సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు
- జగన్ పాలనలో ప్రాజెక్టు సర్వనాశనం
- జరిగిన నష్టం అంతా ఇంతా కాదు

ఏలూరు,: పోలవరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కాలంతో పరుగులు తీస్తూ పనులు చేయాలని ఆకాంక్షిస్తున్నామని.. దానికి అనుగుణంగానే నిర్దిష్ట గడువులోగా వాటిని పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందించామని ప్రకటించారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు క్షేత్రాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి.. తర్వాత అధికారులతో సమీక్షించారు. పనులు పరుగులు తీయించేలా దిశానిర్దేశం చేశారు. మీడియాతోనూ మాట్లాడారు.


2లో


# లగచర్ల రచ్చ!

- శాసనసభలో చర్చకు బీఆర్ఎస్ పట్టు..
- టూరిజం పాలసీపై లఘు చర్చను అడ్డుకున్న ప్రధాన ప్రతిపక్షం


2లో




# కేటీఆర్‌పై 'ఫార్ములా' అస్త్రం!



- అర్వింద్‌కుమార్, ఇతర అధికారులపైనా ఏసీబీ విచారణకు నిర్ణయం
- ఈ అంశంలో తక్షణమే ఏసీబీకి లేఖ రాయాలని సీఎస్‌కు ఆదేశం
- దీంతో కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చంటూ తీవ్రస్థాయిలో ఊహాగానాలు
- చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రివర్గ భేటీ తర్వాత మంత్రుల వ్యాఖ్యలు
- 'విద్యుత్' కమిషన్ నివేదికకూ ఆమోదం.. నేడో రేపో అసెంబ్లీ ముందుకు..
- భూమిలేని రైతు కూలీలకు ఈ నెల 28 నుంచి రూ. 12 వేల సాయానికి ఓకే

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుపై 'ఫార్ములా%-%ఈ' అస్త్రం ప్రయోగించేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ ప్రారంభించాలని సోమవారం సీఎం రేవంత్


2లో

# నేడే జమిలి బిల్లు

జమిలి సహా ఇతర బిల్లులు కూడా ప్రవేశపెట్టి ఉభయ సభలను సాధ్యమైనంత త్వరలో వాయిదా వేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం.. 2029లో జమిలి ఎన్నికలు జరిపించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని, స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జమిలి పరిధిలోకి తీసుకురావడం 2034 నాటికి జరుగుతుందని అధికార వర్గాలు అంటున్నాయి. జమిలి ఎన్నికలకు ప్రధాన అడ్డంకులను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. వివిధ రాజకీయ పార్టీలను ఒప్పించి రాజ్యాంగ సవరణలు సాఫీగా జరిగేలా చూడడం ప్రధానమైనది. అలాగే జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణను, 2027 నాటికి నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ అమలు చేసే నియోజకవర్గాల గుర్తింపును పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, పార్లమెంటుతో పాటు ఏదైనా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులు ఉంటే?.. అలాంటి సందర్భంలో ఏం చేయాలో నిర్దేశించే నిబంధనను రాజ్యాంగ సవరణ బిల్లులో పొందుపరిచింది. ఆ రాష్ట్ర ఎన్నికలను తర్వాత నిర్వహించేలా రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు బిల్లులోని సెక్షన్ 2 సబ్ క్లాజ్ 5లో చేర్చారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం కేంద్రం జేపీసీకి నివేదిస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం సాయంత్రానికి జేపీసీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉందని తెలిపాయి. కీలకమైన జమిలి బిల్లు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మంగళవారం పార్లమెంటు సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ బీజేపీ లోక్‌సభలో తమ ఎంపీలకు విప్ జారీ చేసింది.ద

# ఏడాదిలో మావోయిస్టులను ఏరివేస్తాం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గుండం గ్రామంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం పర్యటించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా ఇలాకాగా భావించే ప్రాంతంలోని గుండం గ్రామానికి అమిత్ షా ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పాఠశాలను ప్రారంభించారు. చిన్నారులతో సరదాగా మాట్లాడారు. అనంతరం గ్రామంలో చెట్టు కింద ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులతో మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా గ్రామం అభివృద్ధి చెందలేదని, పక్కా ఇళ్లు, రోడ్లు కూడా కనిపించడం లేదని, ఈ పరిస్థితికి మావోయిస్టులే ముఖ్య కారణమని అమిత్ షా అన్నారు. 2026 నాటికి ఛత్తీసగఢ్‌లో మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు తుపాకులు వీడాలని, లొంగిపోవాలని సూచించారు.గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే ఏడాదిలోపు అన్ని గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ప్రతీ పేద కుటుంబానికి పక్కా ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు చేసిందని, ప్రతీ చిన్నారిని బడికి పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. చదువుకుంటేనే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్య ఉన్నా పోలీసు క్యాంపులో చెప్పాలని, అన్ని రకాలుగా బలగాలు ఆదుకుంటాయని తెలిపారు. ప్రతీ కుటుంబం ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను క్యాంపులో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం అమిత్ షా సీఆర్పీఎఫ్ అధికారులతో సమావేశమయ్యారు. మావోయిస్టుల కదలికలతో పాటు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.గుండం గ్రామం, దాని పరిసర ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. గుండం గ్రామం హిడ్మా సొంత ఊరైన పూవర్తి గ్రామానికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గుండం, తెర్రం, పూవర్తి గ్రామాలను మావోయిస్టు పార్టీ రాజధానులుగా పిలుస్తారు. గతంలో ఈ ప్రాంతంలోని అడవులపై నుంచి హెలికాప్టర్‌లో వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. అలాంటిది నేడు ఆయా గ్రామాలకు బలగాలు రహదారులు ఏర్పాటు చేశాయి. వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. హిడ్మా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పర్యటించి పోలీసు బలగాల్లో ఆత్మస్థైర్యం నింపాలనే లక్ష్యంతోనే అమిత్ షా పర్యటన సాగినట్లు తెలుస్తోంది. ఆయన వెంట ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్, ఇతర అధికారులు ఉన్నారు.

# కాలంతో పరుగు!

(మొదటి పేజీ తరువాయి)



2019లో మేం మళ్లీ గెలిచి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తయ్యేది

పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర జీవనాడి అని, ఈ ప్రాజెక్టును నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో చర్చించామని నిర్మాణ పనులకు దశల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని 2026 నాటికి పూర్తి చేయబోతున్నామని ధీమాగా చెప్పారు. డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులను సమాంతరంగా చేపట్టవచ్చని నిపుణులు సూచించారని తెలిపారు. దెబ్బతిన్న వాల్ స్థానంలో కొత్త డయాఫ్రం వాల్ పనులు జనవరి 2వ తేదీన మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన యంత్ర సామగ్రిని ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. వాల్ నిర్మాణం 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. 2014-19 మధ్య తమ ప్రభుత్వ కాలంలో 72 శాతం పనులు పూర్తి చేశామని, గత ప్రభుత్వం కేవలం 3.84 శాతం మాత్రమే పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ప్రాజెక్టుకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని దుయ్యబట్టారు. రూ.2,400 కోట్ల నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తెలియజేసి మొదటి దశ నిర్మాణానికి రూ.12,157 కోట్లు సాధించామన్నారు. గత ఐదేళ్లలో ప్రాజెక్టు పనులు చేయకపోవడం వల్ల రూ.15 వేల కోట్ల నష్టం వచ్చిందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తయితే ఆ లాభం కూడా వచ్చి ఉండేదని, అది కూడా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 'అప్పట్లో డయాఫ్రం వాల్ రూ.440 కోట్లతో పూర్తి చేస్తే ప్రస్తుతం అది 990 కోట్లు ఖర్చు కానుంది. శాండ్ ఫిల్లింగ్‌కు రూ.350 కోట్లు అవుతుంది. కేంద్రం నుంచి రూ.8,242 కోట్లు వస్తే అందులో రూ.2,342 కోట్లు దారి మళ్లించారు. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు 76.79 శాతం పూర్తయ్యాయి.ప్రాజెక్టు నిర్మాణంపై నిపుణులతో వర్క్‌షాపు కూడా నిర్వహించాం' అని తెలిపారు. డిజైన్ల ఆమోదం, అనుమతులు, ఇతరత్రా అవసరాలపై ముందుచూపుతో వ్యవహరించాలని స్పష్టంచేశారు. నిర్దిష్ట కార్యాచరణ ప్రకటన ద్వారా పనులు శరవేగంగా పూర్తిచేసే అతిపెద్ద బాధ్యతను ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించారు గైడ్‌బండ్ కుంగడానికి, నష్టం జరగడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా.. గత ప్రభుత్వం నష్టం చేసి ఇప్పటికీ బుకాయిస్తూనే ఉందని, డయాఫ్రం వాల్ అంటే తెలియని వ్యక్తులు నాటి ప్రభుత్వంలో ఉన్నారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. గత పాలకులకు ప్రజలు తగిన శిక్ష విధించారని.. 11 సీట్లే ఇచ్చారని చెప్పారు. కానీ ప్రాజెక్టు పూర్తిగాకపోవడం వల్ల జరిగిన నష్టాన్ని రికవరీ చేయలేం కదా అని వ్యాఖ్యానించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే.. పోలవరం రాష్ట్రానికి జీవనాడి. దానిని పూర్తి చేయాలన్న తలంపుతో 30 సార్లు పోలవరం వచ్చాను. 80 సార్లు వర్చువల్‌గా సమీక్షించా. అటువంటి ప్రాజెక్టును వైసీపీ సర్వనాశనం చేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో నాటి సీఎం జగన్ అప్పటి కాంట్రాక్టరుకు నోటీసులిచ్చి బయటకు పంపేశారు. అవినీతి, కుట్ర, అనుభవరాహిత్యంతో ప్రాజెక్టు పనులన్నీ నాశనం చేశారు.

# లగచర్ల రచ్చ!

హైదరాబాద్: 'లగచర్ల'ఘటనపై సోమవారం శాసనసభ అట్టుడికింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, నినాదాలతో హోరెత్తింది. 'రాష్ట్రంలో పర్యాటక విధానం'అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు లఘుచర్చను ప్రారంభించగానే బీఆర్ఎస్ సభ్యులంతా లేచి.. 'లగచర్ల'రైతుల నిర్బంధం, అరెస్టులపై చర్చించాలని పట్టుబట్టారు. స్పీకర్ అంగీకరించకపోవడంతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన తెలిపారు. అధికార పక్షం నుంచి డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు లేచి బీఆర్ఎస్ సభ్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. ఈ గందరగోళంలో సభను కొనసాగించలేక మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

**వాయిదా తీర్మానాలను తిరస్కరించడంతో..**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఫార్మా విలేజీ భూసేకరణను ప్రతిఘటించిన రైతులను నిర్బంధించిన ఘటనపై చర్చించాలంటూ టి.హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు ప్రశ్నోత్తరాలు ముగిసిన తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. దీనితో పార్టీ సభ్యులంతా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం..దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం.. నహీ చలేగా.. తానా షాహీ నహీ చలేగా..'అని నినాదాలు చేశారు. దీనితో సభను కొద్దిసేపు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

**వెనక్కి తగ్గని బీఆర్ఎస్ సభ్యులు**

సభ తిరిగి ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు తమ నిరసన కొనసాగించారు. ఈ గందరగోళం మధ్యే పర్యాటక విధానంపై లఘు చర్చను ప్రారంభించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్పీకర్ సూచించారు. కానీ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలతో గందరగోళ వాతావరణం నెలకొంది. దీనిపై స్పీకర్ కల్పించుకుని... బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులను అప్పగించి ఎవరి స్థానాల్లో వారు కూర్చుంటే హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశం ఇస్తామని చెప్పారు. అయితే ముందు మాట్లాడేందుకు అవకాశమిస్తే ప్లకార్డులను అప్పగిస్తామని హరీశ్‌రావు బదులిచ్చారు. స్పీకర్ అవకాశం ఇవ్వకపోవడంతో నిరసనను కొనసాగించారు. బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. అందరం కలసి రూల్స్ బుక్ తయారు చేసుకున్నామని, సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం దానికి విరుద్ధమని స్పీకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు ప్రశాంతంగా కూర్చోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఇక సభలో ప్లకార్డులు, కరపత్రాలు ప్రదర్శించరాదని నిబంధనలు ఉన్నాయని, శాసనసభా వ్యవహారాల మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన హరీశ్‌రావుకు అది బాగా తెలుసని మంత్రి డి.శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

అసెంబ్లీ కార్యకలాపాలపై ప్రతిరోజూ బులెటిన్ ఇస్తారని, వాటి ప్రకారమే సభ నడుస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు లేవనెత్తిన ప్రతి అంశంపై ప్రభుత్వం సమాధానమిస్తుందని హామీ ఇచ్చారు.

# సర్పంచుల బిల్లులపై దుమారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని బీఆర్ఎస్ నేతలకు సభలో మాట్లాడే అవకాశం కల్పిస్తామన్నారు. అయినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తగ్గలేదు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడారు. సభపైనా, స్పీకర్‌పైనా బీఆర్ఎస్ నేతలకు గౌరవం లేదా? అని ప్రశ్నించారు. సభా మర్యాదను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. కాగా, లగచర్ల రైతుల అంశంపై చర్చ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ దాన్ని తోసిపుచ్చారు. రాష్ట్రంలో సర్పంచులకు బిల్లుల చెల్లింపుపై సభలో దుమారం రేగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నాటి బిల్లులే పెండింగ్‌లో ఉన్నాయని, అది బీఆర్ఎస్ కాదని.. 'బకాయిల రాష్ట్ర సమితి' అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. బిల్లులపై మంత్రి సరైన సమాధానం ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. బడా కాంట్రాక్టర్లకు ఒక్క నవంబరు నెలలోనే రూ.1,200 కోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. రూ.లక్షల్లో ఉండే సర్పంచుల బిల్లులను చెల్లించడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. సర్పంచుల పాలిట కాంగ్రెస్ హస్తం భస్మాసుర హస్తమైందన్నారు. సభ ప్రారంభం కాగానే స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క సమాధానమిస్తూ ఈ ఏడాది నవంబరు 1 నాటికి సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తం రూ.691.93 కోట్లుగా ఉన్నట్లు చెప్పారు. ఇవన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి వచ్చిన వారసత్వ బిల్లులేనని, 2014 నుంచి కూడా పెండింగ్ బిల్లులు ఉన్నాయని తెలిపారు. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక్క సంతకం చేస్తే ఈ బిల్లుల చెల్లింపు జరిగిపోయేదని, అప్పుడు ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్ల సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు రూ.740 కోట్లు, బీఆర్ఎస్ హయాంలో పెండింగ్ పెట్టిన ఉపాధి హామీ పథకం బిల్లుల నిధులు రూ.450 కోట్లు కూడా విడుదల చేశామని చెప్పారు. 'మన ఊరు%-%మన బడి' పథకం కింద గత ప్రభుత్వం రూ.1,100 కోట్ల విలువైన పనులు చేయించిందని, ఇందులో రూ.800 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పెండింగ్ బిల్లుల సొమ్మును చెల్లిస్తామని తెలిపారు. హరీశ్ మాట్లాడుతూ.. బిల్లుల గురించి గవర్నర్‌ను, మంత్రులను కలిసి మొర పెట్టుకుందామని వస్తే అరెస్టులు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల బిల్లులు విడుదల చేయకుండా కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. వీరికి 9 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కాగా, రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో 17 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.దసభలో గందరగోళం కొనసాగుతుండగానే పర్యాటక విధానంపై మంత్రి జూపల్లి కృష్ణారావును మాట్లాడాలని స్పీకర్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక స్థితిని దిగజార్చింది బీఆర్ఎస్సేనని మండిపడ్డారు. జూపల్లి మాట్లాడుతుండగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకెళ్లారు. వారి చేతుల్లో ఉన్న ప్లకార్డులను తీసుకోవాలని మార్షల్స్‌ను స్పీకర్ ఆదేశించారు. ప్లకార్డులను తీసుకునేందుకు యత్నించగా ఎమ్మెల్యేలు ప్రతిఘటించారు. ఆ గందరగోళం మధ్యనే సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు.

# గ్రూప్-2 ప్రశ్నలపై వివాదం

రోజుల పాటు మొత్తం నాలుగు పేపర్లకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 45.57 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూపు-2 పోస్టులకు మొత్తం 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,51,486 మంది పరీక్షలు రాశారు. ఎకానమీలో రాష్ట్ర, కేంద్ర బడ్జెట్‌లపై, వివిధ పథకాలపై ప్రశ్నలను ఇచ్చారు. రెవెన్యూ లోటు, వివిధ జిల్లాల ర్యాంకులపై ప్రశ్నలను అడిగారు. అలాగే.. వివిధ సర్వేలు, పలు పంటలు, జనాభా లెక్కలపై కూడా ప్రశ్నలను ఇచ్చారు. రైతు బంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, మహాలక్ష్మి వంటి పథకాలపై కూడా ప్రశ్నలను ఇచ్చారు. అభ్యర్థులకు అనేక అంశాల్లో పూర్తి అవగాహన ఉంటే తప్ప సమాధానాలు రాయలేని ప్రశ్నలు చాలా ఉన్నాయని పోటీ పరీక్షల నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రపై ముఖ్యంగా తొలి దశ, మలిదశ ఉద్యమాలు, వివిధ కమిటీలు, పలువురు ఉద్యమకారులు, సంస్థలు, పార్టీల గురించి పలు ప్రశ్నలు అడిగారు. గద్దర్, విమలక్క గేయాలపై, ప్రొఫెసర్ జయశంకర్‌లపై కూడా కొన్ని ప్రశ్నలు వచ్చాయి. తెలంగాణ తల్లి పాత రూపానికి సంబంధించి ఓ ప్రశ్నను అడిగారు. తెలంగాణ తల్లికి సంబంధించి ఏది సరికాదో గుర్తించండి అంటూ.. 'ఈమె గద్వాల, పోచంపల్లి చీరలను పోలిన చీరలో ఉంది. తెలంగాణ తల్లి విగ్రహ కిరీటం, వడ్డాణంలో కోహినూరు, జాకబ్ వజ్రాలను కూర్చినారు. ఈమె ఒక చేతిలో బోనం పట్టుకుంది. ఈమె పాదాల మెట్టెలు కరీంనగర్ ఫిలిగ్రీ వెండితో తయారు చేశారు' అంటూ ఆప్షన్లను ఇచ్చారు.

# కేటీఆర్‌పై 'ఫార్ములా' అస్త్రం!

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకుంది. దీనిపై తక్షణమే ఏసీబీకి లేఖరాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించినట్టు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కేటీఆర్‌ను తక్షణమే అరెస్టు చేస్తారా? అన్న అంశంపై తీవ్రస్థాయిలో ఊహాగానాలు జరుగుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందంటూ మంత్రివర్గ భేటీ తర్వాత కొందరు మంత్రులు వ్యాఖ్యలు చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. నిజానికి రాష్ట్రంలో రాజకీయ బాంబులు పేలుతాయని గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన సమయంలోనే.. 'ఫార్ములా%-%ఈ' రేసు వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చంటూ ప్రచారం జరిగింది. సోమవారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. 'ఫార్ములా%-%ఈ' కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై విచారణ చేపట్టేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై రాష్ట్ర మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఏసీబీ విచారణ ప్రారంభించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ అంశంపై సూటిగా స్పందించేందుకు ప్రభుత్వ వర్గాలు నిరాకరించాయి. 'విదేశీ కంపెనీలైన ఫార్ములా%-%ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు నేరుగా ప్రభుత్వ నిధులను చెల్లించే విషయంలో నిర్ణయాధికారం నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌కు ఉందా? రిజర్వు బ్యాంకు అనుమతి లేకుండా విదేశీ కంపెనీలకు నేరుగా ప్రభుత్వ నిధులను చెల్లించవచ్చా? ఈ విషయంలో నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా? అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఈ ఒప్పందం ఎలా చేసుకుంటారు?' అనే అంశాలపై ఏసీబీ విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

**భారీగా డబ్బులు చేతులు మారాయని..**

ఫార్ములా%-%ఈ కార్ల రేసులో అవకతవకలు జరిగాయని.. భారీగా డబ్బులు చేతులు మారాయని మంత్రివర్గం అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ క్రీడల నిర్వహణతో రాష్ట్రానికి రూ.7 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఇటీవల కేటీఆర్ పేర్కొన్న నేపథ్యంలో... ఈ విషయాలను ఆయన ఏసీబీకి చెప్పుకోవాలని కీలక మంత్రి ఒకరు పేర్కొన్నారు. కేటీఆర్ అరెస్టు భయంతోనే ఇంటి దగ్గర కాపలా పెట్టుకున్నారని, కేంద్రంలోని పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్లారని ఆరోపించారు. ఎవరినో అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందా?, బీఆర్ఎస్ నేతలు అహంకారంతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.

**అధికారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సిందే!**

'ఫార్ములా%-%ఈ' కారు రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌తోపాటు ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్, ఇతర అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిందేనని కీలక మంత్రి ఒకరు పేర్కొన్నారు. అరవింద్‌కుమార్ విచారణకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ) అనుమతి అవసరం లేదని.. సీఎస్ అనుమతిస్తే సరిపోతుందని తెలిపారు. అధికారిపై నేరారోపణలు నమోదు చేసే సమయంలోనే డీఓపీటీ అనుమతి అవసరమని వెల్లడించారు. ఫార్ములా%-%ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలపై సైతం ఏసీబీ విచారణ చేపడుతుందని, వాటికి కూడా నోటీసులు ఇస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ మౌఖిక ఆదేశాలతోనే ఆ రెండు కంపెనీలకు నిధులు చెల్లించినట్టు అరవింద్‌కుమార్ ఇప్పటికే తెలిపారని గుర్తు చేశారు.

# పోలవరం ప్రాంతంలోని సమస్యలు పరిష్కరించండి

## సీఎం నారా చంద్రబాబు నాయుడికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి

**ఏలూరు, డిసెంబరు 16 : (డైలీ రిపోర్ట్ ):** పోలవరం నియోజకవర్గంలో నెలకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పోలవరం సందర్శనకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. వేలేరుపాడులో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఎంపీ వినతి పత్రం అందజేశారు.పోలవరం ఏజెన్సీ ప్రాంతంలోని వేలేరుపాడులో మరో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. బుట్టాయగూడెంలో ఉన్న ఎమ్మార్ఎస్ లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటికే 100 శాతం సీట్లు భర్తీ అయినట్లు ఐటీడీఏ పిఓ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న విపరీతమైన డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పోలవరం ఏజెన్సీ ప్రాంతంలో గల వేలేరుపాడులో మరో ఈ ఏం ఆర్ ఎస్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలని ఎంపీ విన్నవించారు.ప్రత్యామ్నాయ కాలనీ ఏర్పాటు చేయండి: తరచూ వరద ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్న వేలేరుపాడు మండలం కమ్మరిగూడెంలోని 220 కుటుంబాలను ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు ఎంపీ విజ్ఞప్తి చేశారు. 2024 జులైలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు, 2018 నాటి వర్షాల సందర్భంగా పోటెత్తిన వరదలతో కమ్మవారిగూడెం ముంపునకు గురైందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తరచూ వరదలు వల్ల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ గ్రామానికి సమీపంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎత్తైన స్థలంలో పట్టాలు ఇచ్చి ప్రత్యామ్నాయ కాలనీని నిర్మించి ఇవ్వాలని ఎంపీ విన్నవించారు.పెద్దవాగు సమస్య పరిష్కరించండి.2024లో పరీవాహక ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పోటెత్తిన వరదలతో అశ్వారావుపేట మండలం కుందవల్లి గ్రామం వద్ద పెదవాగుపై నిర్మించిన మధ్యతరగతి ఇరిగేషన్ ప్రాజెక్ట్ డ్యామ్ యొక్క ఎర్త్ బండ్ కోతకు గురికావడంతో డ్యాంలోని ఎర్త్ బండ్, పార్పెట్ వాల్, చూట్ డ్రెయిన్లు దెబ్బతిన్నాయని, భవిష్యత్తులో ఆకస్మిక వరదల్లో డ్యామ్‌కు ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు రూ.175 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ ప్రభుత్వం స్పిల్‌వే సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కుల నుంచి



1.08 లక్షల క్యూసెక్కులకు పెంచడం ద్వారా అక్కడ అదనంగా 5 వెంట్లు ఏర్పాటు చేయాలని, పెదవాగు ప్రాజెక్టును తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా ప్రకటించాలని ప్రతిపాదించారని, రాష్ట్రాలలోని ఆయకట్టు ప్రాంతాల ఆధారంగా ఖర్చులు భరించాలని తెలంగాణ అధికారుల సూచనల నేపథ్యంలో పెదవాగు ప్రాజెక్టును రెండు రాష్ట్రాల సమ్మిళిత ప్రాజెక్టుగా చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్ర అధికారులతో చర్చించడానికి వీలుగా నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ కోరారు.పోలవరం బాధితులను ఆదుకోండి.పోలవరం మండలం టేకూరు %= ు =% సమస్యలు, గృహాల నిర్మాణం,పునరావాస గ్రామాలకు బస్సులు, ఆసుపత్రి సౌకర్యాలు, దేవరగొందిలో (ప్రగడపల్లి) %శ్రీశ్రీ% ప్యాకేజీలో విడుదల చేయాల్సిన మిగిలిన సొమ్ము, ఇళ్ల స్థలాలు, భూమి లేని పేదలకు సంబంధించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 2015లో 1787 కుటుంబాలకు అధికారులు ఇచ్చిన హామీల అమలు కోసం 2016లో పోలవరం ప్రాజెక్ట్ కోసం ఖాళీ చేయబడిన 7 (ఏడు) గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని, పోలవరం పంచాయతీలోని పునరావాస గ్రామంలో 190 ఇళ్లు నిర్మించారని, మంజూరైన జాబితాలో 17 మంది పేర్లను చేర్చాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.



## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్ 2 పరీక్షలు

**సంగారెడ్డి, డిసెంబర్ 16 (డైలీ రిపోర్ట్ ):**సంగారెడ్డి జిల్లాలో 41 పరీక్ష కేంద్రాలలో ఆది సోమవారాలలో నాలుగు సెషన్లలో జరిగిన గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణం లో జరిగాయి. జిల్లాలో 41 పరీక్ష కేంద్రాలలో 15218 మంది అభ్యర్థులకు గాను మొదటి రోజు మొదటి సెషన్ పరీక్షకు47.4 శాతం మంది అభ్యర్థులు రెండవ సెషన్ పరీక్షకు47.3 శాతం మంది అభ్యర్థులు, సోమవారం జరిగిన సోమవారం ఉదయం జరిగిన మూడవ సెషన్ పరీక్షకు47.3 శాతం మంది అభ్యర్థులు మధ్యాహ్నం జరిగిన నాలుగవ సెషన్ పరీక్షకు47.3 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని వీరభద్ర నగర్ లోని ఎస్వీ జూనియర్ కళాశాల , నల్సాబ్ గడ్డ లోని సాహితి పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులను, అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు .పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా ముగియడానికి ఏర్పాట్లు చేసిన అధికారులను పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి , డిసెంబర్ 16 (డైలీ రిపోర్ట్ ):-** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 58 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తన ఛాంబర్ లో ను , సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ మాధురి , ట్రైనీ కలెక్టర్ మనోజ్, డి ఆర్ ఓ పద్మజ రాణి అర్జీలు స్వీకరించారు . కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం

### సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక




**(డైలీ రిపోర్ట్ ):** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులుగా రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్ కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్ ను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలని, ఆర్‌టిఐ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలుకోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు, ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలని అన్నారు.సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అని ప్రజలతోపాటు అధికారులు కూడా ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతి నుండి మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని 30 రోజుల్లో సమాచారం తీసుకోవచ్చని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలని దుర్వినియోగం చేయకూడదని అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులుగా ఎన్నికైన రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలుగా వేముల పుష్పలత, సంయుక్త కార్యదర్శిగా దీపక్ కులకర్ణి, గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్ లు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం గ్రామ పంచాయతీలు మొదలుకొని పార్లమెంటు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి పౌరుడు దరఖాస్తు చేసుకొని తనిఖీ చేయవచ్చున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెన్నెముక అయిన సమాచార హక్కు చట్టం 2005 కు సంబందించిన 4 (1) బి సంబంధించిన 17 అంశాల సమాచారం, రిజిస్టర్ 1, రిజిస్టర్ 2 న గల కాపీలను ఉచితంగా, స్వచ్ఛందంగా ప్రజలకు కోరినప్పుడు అధికారులు ఇవ్వాలని అన్నారు.మూడో వ్యక్తి సమాచారం విషయంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సమాచారం అయితే సెక్షన్ 11 (1) ప్రకారంగా దరఖాస్తుదారునికి అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇవ్వని అధికారులకు కనిష్టంగా 250 నుండి గరిష్టంగా 25 వేల వరకు జరిమానాలు సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ విధిస్తారు అని అన్నారు.సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సిబిఐ, సిఐడి, కోర్టు జడ్జిమెంట్, దేశ భద్రత సమాచారం, పోలీస్ స్టేషన్ భద్రత, ఆయుధాల సమాచారాన్ని మినహాయించబడిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు జి.ప్రియ రెడ్డి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి ఎర్రబెల్లి ప్రగతి,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అంతటి అజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడానికి సీఎం కప్ క్రీడా పోటీలు

**జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**

**పండుగ వాతావరణంలో సీఎం కప్ క్రీడా పోటీలు**

**టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, డిసెంబర్ 16 :**రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయ అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడం కోసం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను, ఎన్ సి సి విద్యార్థుల, క్రీడాకారుల కవాతు, గౌరవ వందనం స్వీకరించిన అనంతరం టార్చ్ వెలిగించి సీఎం కప్ క్రీడలను క్రాంతి వల్లూరు లాంఛనంగా ప్రారంభించారు. టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టాస్ వేసి కబడ్డీ పోటీలను ప్రారంభించిన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, వాలీబాల్ ఆటను టాస్ వేసి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు 27 మండలాలు, 8 మునిసిపాలిటీలు క్రీడలలో పాల్గొనడం జరిగిందన్నారు .వాటిలో ఖో ఖో, కబడ్డీ, యోగా, చెస్ లలో 1000 మంది క్రీడా కారులు పాల్గొనడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని వారికి అవకాశాలు లేక వారి ప్రతిభ ప్రపంచానికి తెలియకుండా పోయిందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారిని జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు రూపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్రీడలు మానసికల్లాసానికి శరీర దృఢత్వానికి క్రమశిక్షణకు తోడ్పడుతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చదువులో కూడా ప్రతిభ కనబరుస్తారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతోపాటు వారికి ఇష్టమైన ఏదో ఒక క్రీడలు రాణించాలని కలెక్టర్ సూచించారు. తాను సైతం బాస్కెట్బాల్, జిల్లా స్థాయి టోర్నమెంట్లు పాల్గొన్నట్లు అనంతరం కాలేజీ స్థాయిలో బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీల్లో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు. గెలుపు ఓటములను సమంగా స్వీకరించాలన్నారు. గెలుపుతో పొంగిపోవద్దని ఓటమితో కూంగిపోవద్దని గెలుపు కోసం ప్రయత్నించాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. జాతీయస్థాయి క్రీడలలో పాల్గొని ఎక్కువ పథకాలు తేవడమే ముఖ్యఉద్దేశమని అన్నారు. టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశం గ్రామీణ యువతలోని ప్రతిభను వెలికితీయడం. ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా దేశానికి పతకాలు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ ఫర్ స్టేట్ లెవెల్, టిఎన్జిఓస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రెటరీ అమూల్యమ్మ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, డిఎస్ఏ సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## డా. బిఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకున్న శంకర్‌పల్లి మండల వాసి

**శంకర్‌పల్లి డిసెంబర్ 16:(డైలీ రిపోర్ట్):** డా బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2024 సంవత్సరమునకు గాను శంకర్‌పల్లి మండల మాసానిగూడ గ్రామానికి చెందిన మాల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మన్నెగూడెం వేణుగోపాల్ ఎంపిక అయ్యారు. ఈ అవార్డు న్యూ ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 17 వ నేషనల్ కాన్ఫరెన్స్ లో భాగంగా బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఏ) జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఎంఎం గౌతమ్, అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్ చొక్కంపేట ఆంజనేయులు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్సి, ఎస్టీ, బిసి మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి యేటా ప్రజా సామాజిక ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, కవులకు, రచయితలకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలియజేసారు. ఈ సదస్సుకి దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి సుమారుగా 500 మంది డెలిగేట్స్ హాజరైనట్లు తెలిపారు.అనంతరం మన్నెగూడెం వేణుగోపాల్ మాట్లాడుతూ తమను గుర్తించిన బిఎస్ఏ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు రావడంతో తనపై మరింత భాధ్యత పెరిగిందని, అంతే కాకుండా భవిష్యత్తులో రెట్టింపు ఉత్సాహంతో ప్రజా ఉద్యమాలలో పోరాటం చేస్తామని తెలియజేసారు. కార్యక్రమంలో బిఎస్ఏ కార్యదర్శి విష్ణు వర్ధన్, బహుజన సాహిత్య అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.



## ఫిలిం సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా శాలిని జాదవ్

శంకర్‌పల్లి డిసెంబర్ 16:(డైలీ రిపోర్ట్): ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా శాలిని జాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ సమాచార శాఖ రాష్ట్ర రీజినల్ అధికారి షిఫాలీ కుమార్ ఆమెకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శాలిని జాదవ్ మాట్లాడుతూ మహిళల కోసం చేసిన సేవలను గుర్తించి ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు. ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా జనహితం కోరే సినిమాలు రూపొందే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. తాను మహిళల కొరకు చేస్తున్న సేవలకు తన భర్త ఎంతో సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.



## రంగారెడ్డి జిల్లా లో విద్యార్థులు ఎక్కువ ఉన్న పాఠశాల కి ఉపాధ్యులను సర్దుపాటు చేయాలి



జామ కుషాల్ ప్రధాన కార్యదర్శి టి అర్ టి ఎఫ్ రంగారెడ్డి జిల్లా. శంకర్ పల్లి డిసెంబర్ 16:(డైలీ రిపోర్ట్): జిల్లాలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్న పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారు. కావున %ఱజూ% రంగారెడ్డి జిల్లా గారు వెంటనే జిల్లాలో వర్క్ అడ్జస్ట్మెంట్ కింద ఉపాధ్యాయులకు డిప్యూటేషన్స్ ఇవ్వాలని లేనిపక్షంలో విద్యార్థులు నష్టపోతారు ఈ సందర్భంగా ప్రభుత్వం ముందుగా రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయులకు రేష్నలైజేషన్ చేసి తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అట్టి ఉపాధ్యాయుల పోస్టులను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలోకి పోస్టులను సర్దుబాటు చేసినట్లయితే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అవకాశం ఉంటుంది కావున ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే సమస్యకు పరిష్కరించాలి కోరినారు అధ్యక్షులు కొమ్ము లోకేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే ను ప్రారంభించిన కొండకల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య

**దళితులు, బీసీలు, మైనారిటీలు, గిరిజనులు వంటి పేద వర్గాలకు గృహ నిర్మాణం అందించటం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచటం ముఖ్య ఉద్దేశం**

**సర్వే లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిచేస్తాము**



**శంకరపల్లి డిసెంబర్ 16:(డైలీ రిపోర్ట్):** మోకిల మరియు కొండకల్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వే ను సోమవారం ప్రారంభించారు. మోకిల మరియు కొండకల్ గ్రామాలలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ముఖ్యంగా దళిత బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే వసతిని కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకంను ప్రారంభించారు.ఈ పథకం ద్వారా రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు గృహాల నిర్మాణం చేపట్టబడుతోంది. ముఖ్యంగా, ఈ పథకం నడపడానికి బలమైన మద్దతు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రాముఖ్యతనిచ్చారు .ఈ పథకం ద్వారా దళితులు, బీసీలు, మైనారిటీలు, గిరిజనులు వంటి పేద వర్గాలకు గృహ నిర్మాణం అందించటం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచటం లక్ష్యంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య, సంతోష్, రాణి , తదితరులు పాల్గొన్నారు

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707